# "కరి నాగంటి జడ చూడు...!"

యన్నాకుల రమేష్

అప్పారావుకు యింకా పెళ్ళి కాలేదు.


కాని—

పెళ్ళిచేసుకోవాలన్న కోరిక... కోడె వయసును ఆరడి పెడుతుంటే...

పెళ్ళాడబోయే పిల్లకోసం వేట ప్రారంభించాడు.

అయితే—

తను పెళ్ళాడబోయే అమ్మాయి గురించి ఒక నిర్దిష్ట అభిప్రాయాన్ని



ఏర్పరచుకున్నాడు అప్పారావు.

అదేమిటంటే—

నవలా నాయికలా...సినిమా హీరోయిన్‌లా...తను పెళ్ళాడబోయే అమ్మాయికి కూడా పిరుదులు దాటేలా పొడవాటి కురులు వుండాలన్నది అతని ఆకాంక్ష.

ఆ నిశ్చితాభిప్రాయాన్ని మనసులో పెట్టుకొనే పెళ్ళి చూపుల వేట ప్రారంభించాడు అప్పారావు.

ఆ వేటలో—

ఎందరో సుందరాంగులు...మరెందరో బంగారు బొమ్మలు...అతనికి తారసపడ్డారు.

కాని—

వాళ్ళలో ఏ ఒక్కరినీ చేసుకోవడానికి అంగీకరించలేకపోయాడు అప్పారావు.

కారణం—

ఆ అమ్మాయిలంతా అందగత్తెలే అయినప్పటికీ... కన్ను...ముక్కు...తీర్చి దిద్దినట్లున్నప్పటికీ...కేవలం పొడవాటి జడ లేకపోవడంచేతనే వాళ్ళను పెళ్ళాడడానికి నిరాకరించాడు.

అతని వుద్దేశం ఏమిటో అర్థంగాక...ముక్కున 'వేలేసుకున్నారు పెద్దలు.

'అబ్బాయికి అందం కంటే ఆస్థిమీద...కట్నం మీద ఆశ వుంది కాబోలు...' అనుకున్నారు.

అలా అనుకోవడమే తడవుగా లక్షలు కట్నం తీసుకు రాగల అమ్మాయిలను చూపించారు.

వుహూ...

అప్పారావుకు ఎవ్వరూ నచ్చలేదు.

'ఇదేం విడ్డూరమో...యింతమంది అమ్మాయి లను చూపించినా నచ్చడం లేదని నిరాకరిస్తున్నాడు. పెళ్ళి చేసుకోవాలన్న ధ్యాసే లేనట్లుంది'' అనుకున్నారు కొందరు.

''కొంపతీసి అబ్బాయికి అసలు విషయంలో ఏదైనా లోపం వుందో ఏమో...? ఆ విషయాన్ని బయటికి కక్కలేక యిలా వచ్చిన ప్రతి సంబంధం నచ్చలేదన్న సాకుతో తిరగ్గొట్టి దాటవేస్తున్నాడు...''

గుస...గుస...గుస...

చెవులు కొరుక్కున్నారు మరికొందరు.

ఆ విషయాలన్నీ తెలిసి...బాధతో జుట్టు పీక్కున్నాడు అప్పారావు.


'పెళ్ళి మీద ధ్యాస లేకుంటే...అసలు విషయంలో లోపం వుంటే...తను పెళ్ళి చూపులకు ఎందుకు వెళ్తాడు...యింత మంది అమ్మాయిలను ఎందుకు చూస్తాడు...ఆమాత్రం ఆలోచన లేకుండా అనుమానించడమేనా వీళ్ళపని...'

తనలో తను వినుక్కున్నాడు అప్పారావు.

అయినా—

ఎవ్వరేమనుకున్నా సరే...తన నిశ్చితాభిప్రాయాన్ని






మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ మార్చుకోలేదు అప్పారావు.

ఈ దేశంలో ఆడపిల్లలకే కరువా...?!

ఏనాటికయినా...తమ ఆశించినట్లుగా...పొడవాటి కురులున్న అమ్మాయి తనకు తారస పడకపోదు... అలాంటి అమ్మాయినే తను పెళ్ళాడి... తన కోరిక తీర్చుకోకమానూ పోడు...

కృతనిశ్చయంతో వున్నాడు అప్పారావు.

అందుకే—

కార్య సాఫల్యత కోసం పట్టువదలకుండా విజృంభించిన విక్రమార్కుడిలా...పొడవాటి జడవున్న అమ్మాయికోసం... ఆంధ్రదేశం అంతటా గాలింపు కార్యక్రమాన్ని విస్తృతం చేశాడు అప్పారావు.

అలా...అలా...ఆ వేటలోనే...రోజులు... వారాలు...నెలలు...దొర్లుకు పోయాయి.

కాని—

తను కోరుకున్న లక్షణంగల అమ్మాయి మాత్రం అతనికి ఎక్కడా తారసపడలేదు.

"హతవిధీ...ఏమిటీ దారుణం...? ఆడ జనాభా అధికంగా వున్న ఈ దేశంలోనే పొడవాటి జడలున్న అమ్మాయిలు కరువైపోయారా...!"

గోడు గోడున విలపించాడు.

భోరుమని ఏడ్చాడు.

అయినా—

తన దృఢ నిశ్చయాన్ని మాత్రం రవ్వంత కూడా సడలించుకోవడానికి ససేమిరా మనస్కరించలేదతనికి.

అలాగే కాలం దొర్లుకు పోసాగింది.

ముచ్చటగా మూడు పదులు నిండాయి అప్పారావుకు.

బెండకాయ ముదిరినా...బ్రహ్మచారి ముదిరినా... ఎందుకూ పనికి రాకుండా పోతాయి. అని పదే పదే అతని చెవిలో గూడు కట్టుకుని గీపెట్ట సాగారు పెద్దలు.

వుహూ...

తను పట్టిన పట్టును ఆవగింజంత అయినా సడలించుకోలేదు అప్పారావు.

మరికొన్నాళ్ళు గడిచాయి.

ఇక జన్మలో అప్పారావుకు పెళ్ళాడే యోగ్యత లేదని పెద్దలంతా తీర్మానించుకొనే తరుణంలో...హఠాత్తుగా వచ్చిందో సంబంధం...

అమ్మాయి అందాల బొమ్మ...

అంతకు మించి—

పిరుదులు దాటి...మోకాళ్ళవరకూ సాగిన నల్ల త్రాచులాంటి జడ...

అన్ని విధాలా సంతృప్తి చెందాడు అప్పారావు.

తన కాంక్ష తీరింది...

తను కోరుకున్నట్లుగా పొడవాటి జడవున్న అమ్మాయే తనకు పెళ్ళాం కాబోతుంది...

హిప్...హిప్...హుర్రే...

గాలిలో తేలిపోయాడు అప్పారావు

వెంటనే గ్రీన్ సిగ్నల్ యిచ్చేసాడు.

కొద్ది రోజులలోనే—

అప్పారావు యింటి ముంగిట్లో పెళ్ళి బాజాలు మ్రోగాయి.

* * *

జరీ అంచు తెల్ల పంచె...తెలుపు రంగు సిల్కు లాల్చీ వేసుకొని... మల్లెల సౌరభాలను ఆస్వాదిస్తూ... శోభనం గదిలో మల్లెల మంచంమీద కూర్చున్నాడు అప్పారావు.

అరగంట తరువాత పాల గ్లాసుతో పాల మురుగు పట్టుచీరెతో గదిలోకొచ్చింది ఆండాళ్ళు.

అప్పారావు కళ్ళన్నీ ఆండాళ్ళు జడమీదనేవున్నాయి.

జడ నిండా అరవిరిసిన మరు మల్లెలు సుమధుర సౌరభాలను వెదజల్లుతూ కవ్విస్తుంటే మరింత సొగసులు యినుమడించిన ఆ జడను చూసి...మోహావేశుడవుతున్నాడు అప్పారావు.

ఆహా...ఏమి నా భాగ్యమూ...!

మనసులోనే పాడుకున్నాడు.

తలపులలోనే తాండవమాడాడు.

అంతలో—

పాలగ్లాసు తీసుకుని అతని చేరువలోకి వచ్చింది ఆండాళ్ళు.

అప్పారావు కొంటెగా చూసాడు.

ఆండాళ్ళు సమ్మోహనంగా నవ్వింది.

అంతే—

పొడవాటి జడను తనివితీరా చూస్తూ...ఆమెను పొదివి పట్టుకుని మల్లెల మంచంమీదకు లాగాడు అప్పారావు.

ఆపైన—

మధురానుభవాలు...

సుందర సుమధుర క్షణాలు...

* * *

ఆ రాత్రి—

అప్పారావు...ఆండాళ్ళు...యిద్దరూ నిద్రపోలేదు.

తెలతెలవారుతుండగా...బడలికతో కళ్ళు మూసుకున్నాడు అప్పారావు.

తన నడుం చుట్టూ పెనవేసుకొని వున్న భర్త చేతిని సున్నితంగా తొలగించి...మెల్లిగ మంచం దిగింది ఆండాళ్ళు.

చెదిరిన ముంగురులను సవరించుకొని...ముందుకు అడుగులు వేసింది.

కాని—

అంతవరకూ నిద్ర నటిస్తున్న అప్పారావు...విరిపి తలపులు చుట్టుముట్టగా తనకు అత్యంత ప్రియమైన ఆండాళ్ళు జడను తమకంతో చూస్తూ...తటాలున అందుకున్నాడు.

అంతే—

బారెడు పొడవున్న ఆ జడ అలాగే అతని చేతిలో మిగిలిపోయింది.

కాని—

భుజాలు కూడా దాటని కురులతో వున్న ఆండాళ్ళు మాత్రం అలాగే ముందుకు సాగిపోయింది.

అప్పారావు అదిరిపడ్డాడు.

ఉలికిపాటుగా లేచి కూర్చున్నాడు.

ఆ తరువాత—

తన చేతిలో మిగిలిన, తనకు అత్యంత ప్రియమైన పొడవాటి జడవైపు వెర్రిగా చూసాడు.

అంతే—

అప్పారావుకు గిర్రున కళ్ళు తిరిగాయి.

దబ్...

అలాగే వెనక్కు విరుచుకు పడిపోయాడు అప్పారావు...పాపం...అప్పారావు.

